'కంగువ' పూర్తి చేసిన సూర్య..

సూర్య కథానాయకుడిగా శివ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కంగువ'. వినూత్నమైన పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ చిత్రంలో సూర్య పలు భిన్నమైన వేషాల్లో సందడి చేయనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన తన వర్క్ పూర్తయిందని ఆయన తెలిపారు. ఈ మేరకు ఎక్స్ (ఇంతకుముందు ట్విటర్) పోస్ట్ పెట్టారు. "కంగువ'లో నా చివరి షాట్ పూర్తయింది. సినిమా పట్ల మొత్తం యూనిట్ పాజిటివ్‌గా ఉంది. ఒక ముగింపు మరెన్నింటికో ఆరంభం. దర్శకుడు శివ, ఆయన బృందానికి ధన్యవాదాలు. ఈ మూవీ నాకెంతో స్పెషల్. థియేటర్‌లో చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా" అని పేర్కొన్నారు. అంతేకాదు, సినిమాలో తాను పోషించిన పాత్రకు సంబంధించిన స్టిల్‌ను కూడా పంచుకున్నారు. కంగ అనే ఓ పరాక్రముడి కథతో ఈ సినిమా సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందులో సూర్య ఆరు భిన్నమైన అవతారాల్లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దిశా పటానీ కథానాయిక. బాబీ దేవోల్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. జగపతి బాబు, యోగిబాబు, కోవై సరళ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని ఏకంగా 38 భాషల్లో విడుదల చేయనున్నారు. ఐమ్యాక్స్, 3డీ వెర్షన్స్‌లోనూ ఇది అందుబాటులో ఉండనుంది.

ఇది ఎవరూ టచ్ చేయలేని రికార్డ్ చిరంజీవి



'వాల్తేరు వీరయ్య'ను ఆదరించిన ప్రేక్షకులకు అగ్ర కథానాయకుడు చిరంజీవి ధన్యవాదాలు చెప్పారు. ఇది క్రియేట్ చేసిన రికార్డును ఎవరూ అందుకోలేరని అన్నారు. "2023 సంక్రాంతి నుంచి 2024 సంక్రాంతి వరకు కృష్ణాజిల్లా అవనిగడ్డలోని రామకృష్ణ థియేటర్‌లో 'వాల్తేరు వీరయ్య' ఆడుతోందంటే.. మీరు నన్ను ఎంతలా అభిమానిస్తున్నారో అర్థమవుతోంది. మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు. ఈ రోజుల్లో ఇది ఎవరూ టచ్ చేయలేని రికార్డ్. దీనికి కారణం మీకు నచ్చేలా చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు బాబీ, సంగీత దర్శకుడు దేవిశ్రీ, నా తమ్ముడు రవితేజతోపాటు ఇతర తారాగణం, మైత్రి మూవీ మేకర్స్ సంస్థ. అందరి సమష్టి కృషి 'వాల్తేరు వీరయ్య'. ఇలాంటి మరెన్నో చిత్రాలను మీకు అందించేందుకు ప్రతిక్షణం ప్రయత్నిస్తూనే ఉంటా" అని తెలిపారు.

మూడు నెలల్లో సినిమా పూర్తిచేయడం అంత తేలిక కాదు: నాగార్జున

సంక్రాంతి పండగకు కిష్టయ్య (పాత్ర పేరు) వస్తున్నాడు.. బాక్సాఫీసు వద్ద హిట్ కొట్టబోతున్నాడంటూ అభిమానుల్లో జోష్ నింపారు ప్రముఖ నటుడు నాగార్జున . 'నా సామి రంగ' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడారు. ఈయన హీరోగా కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ తెరకెక్కించిన చిత్రమిది. అల్లరి నరేశ్, రాజ్ తరుణ్, ఆషికా రంగనాథన్, మిర్నా మేనన్, రుక్సర్ థిల్లాన్ కీలక పాత్రలు పోషించారు. జనవరి 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈవెంట్ నిర్వహించారు.

"టీవీలు వచ్చిన సమయంలో సినిమాల పని అయిపోయింది.. ఎవరూ వాటిని చూడరు అని అన్నారు. తర్వాత డీవీడీలు, ఫోన్‌లు, ఓటీటీలు.. ఇలా ఏ టెక్నాలజీ వచ్చినా సినిమాలపై ప్రభావం పడుతుందనే మాట వినిపించేది. కానీ, సినిమా ఆగలేదు. ప్రేక్షకులు చూస్తూనే ఉన్నారు. సంక్రాంతి పండగకు సినిమాలు చూడడం మన ఆనవాయితీ. ఈ పండగకు నాలుగు చిత్రాలు వస్తున్నాయి. మహేశ్‌బాబు 'గుంటూరు కారం', తేజ సజ్జ 'హను-మాన్', వెంకటేశ్ 'సైంధవ్' చిత్ర బృందాలకు ఆల్ ది బెస్ట్. మేం 'నా సామి రంగ'తో రాబోతున్నాం. మా సినిమాకి స్టార్.. సంగీత దర్శకుడు కీరవాణి. షూటింగ్ ప్రారంభంకాకముందే మూడు పాటలు, పలు సన్నివేశాలకు నేపథ్య సంగీతం సిద్ధం చేశారు. అదీ ఆయన ప్రతిభ. కీరవాణి, గీత రచయిత చంద్రబోస్.. దర్శకుడు విజయ్ బిన్నీకి సపోర్ట్ ఇచ్చారు. మూడు నెలల్లో సినిమా పూర్తి చేయడం అంత తేలిక కాదు. సమష్టి కృషితో మాకు సాధ్యమైంది" అని పేర్కొన్నారు.



హృదయాలను హత్తుకునేలా బ్రహ్మానందం ఆత్మకథ : రామ్ చరణ్

టాలీవుడ్ సీనియర్ కమెడియన్ బ్రహ్మానందం తన జీవిత కథను 'నేను.. మీ బ్రహ్మానందం' పేరిట పుస్తక రూపంలో ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఇటీవలే ఈ పుస్తకం మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చింది. తాజాగా తన ఆత్మకథ పుస్తకాన్ని బ్రహ్మానందం.. టాలీవుడ్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌కు అందించారు. ప్రస్తుతం గేమ్ ఛేంజర్ షూటింగ్‌లో ఉన్న చరణ్‌ను కలిసిన బ్రహ్మానందం.. ఆత్మకథ పుస్తకాన్ని బహుమతిగా అందించారు.

ఈ మేరకు బ్రహ్మానందం పుస్తకాన్ని అందిస్తున్న ఫొటోని చరణ్ తన సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'తన అద్భుతమైన జీవిత ప్రయాణాన్ని బ్రహ్మానందం గారు 'నేను..' పుస్తకంలో చాలా హాస్యంగా, హృదయానికి హత్తుకునేలా రాశారు. ఈ పుస్తకంలోని పేజీలు ఆయన మనకు అందించిన హాస్యం, జీవిత పాఠాలను చూపిస్తాయి. ఈ పుస్తకాన్ని అమెజాన్‌లో ఆర్డర్ చేసుకోండి' అంటూ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం చరణ్ పోస్ట్ తెగ వైరల్ అవుతోంది.

మహేశ్.. వాళ్లకు మీరొక ఎమోషన్..

నమ్రత ఆసక్తికర పోస్ట్

మహేశ్‌బాబు అభిమానులను ఉద్దేశించి నమ్రత ఆసక్తికర పోస్ట్ పెట్టారు. "మహేశ్ అభిమానుల గురించి ఇప్పటికే ఎంతోమంది గొప్పగా చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఆయన్ని ఆదరిస్తున్నారు. ప్రతి ప్రయత్నంలో అండగా నిలిచి.. మరింత కష్టపడి పనిచేసేందుకు దోహదపడుతున్నారు. (గుంటూరు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఉద్దేశించి) గుంటూరులో అభిమానులు చూపించిన ప్రేమను చూసి ఓ విషయం గర్వంగా చెప్పాలని ఉంది. మహేశ్.. అభిమానులకు మీరొక ఎమోషన్. ఈ ప్రేమ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నా" అని పేర్కొన్నారు. మహేశ్ హీరోగా నటించిన 'గుంటూరు కారం' సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో అభిమానులనుద్దేశించి మాట్లాడుతూ మహేశ్ భావోద్వేగానికి గురయ్యారు. "మీరెప్పుడూ నా గుండెల్లో ఉంటారు. సంక్రాంతి నాకు, నాన్నగారికి బాగా కలిసొచ్చిన పండగ. ఆ సీజన్‌లో మా చిత్రం విడుదలైతే అది బ్లాక్‌బస్టరే. ఈసారి కూడా అదే రిపీట్ అవుతుంది. కానీ, ఇప్పుడు నాన్న లేరు. ఆయన నా సినిమాలు చూసి రికార్డులు, కలెక్షన్ల గురించి చెబుతుంటే ఆనంద పడేవాడిని. ఆ సంగతులన్నీ మీరే చెప్పాలి. ఇక నుంచి మీరే నాకు అమ్మ, నాన్న" అని అన్నారు. దీనికి సంబంధించిన వీడియోను ఇన్‌స్టాలో షేర్ చేసిన నమ్రత ఈ పోస్ట్ చేశారు.

నాని ఎప్పటిలాగే అదరగొట్టేశారు

నాని హీరోగా తెరకెక్కిన 'హాయ్ నాన్న' చిత్రంపై నటి జాన్వీకపూర్ ప్రశంసల వర్షం కురిపించారు. "మృణాల్ ఠాకూర్ నటనకు ప్రేమలో పడిపోయా. తొలి ప్రయత్నంలోనే మనుసుని హత్తుకునే చిత్రాన్ని అందించినందుకు శౌర్యువ్‌కు కృతజ్ఞతలు. నాని.. ఎప్పటిలాగే అదరగొట్టేశారు" అని ఇన్‌స్టా స్టోరీస్‌లో పోస్ట్ పెట్టారు. దీనిపై చిత్ర నిర్మాణ సంస్థ వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆనందం వ్యక్తం చేసింది. 'మీ ప్రశంసలు మాకెంతో విలువైనవి' అని ట్వీట్ చేసింది. 'దసరా' తర్వాత నాని నటించిన చిత్రమిది. మృణాల్ ఠాకూర్ కథానాయిక. బేబీ కియారా, నాజర్, జయరాం కీలకపాత్రలు పోషించారు. డిసెంబర్ 7న విడుదలైన ఈ చిత్రం విజయాన్ని అందుకుంది. తండ్రిగా నాని నటనకు సినీ ప్రముఖులు ఫిదా అయ్యారు. ప్రస్తుతం ఇది నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. 'దేవర'తో తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నారు జాన్వీకపూర్. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహిస్తోన్న చిత్రమిది.

రజినీకాంత్ 'లాల్ సలామ్' వాయిదా.. కొత్త రిలీజ్ డేట్ ఇదే.!



జైలర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 'లాల్‌సలామ్' . రజినీ కూతురు ఐశ్వర్య ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుంది. విష్ణువిశాల్, విక్రాంత్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. అయితే ఈ సినిమాను మొదట సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమా పోస్ట్ ప్రోడక్షన్స్ పనులు జరుగుతుండగా.. మూవీలో రజినీకాంత్‌కి సంబంధించిన కొన్ని సన్నివేశాలు హార్డ్ డిస్క్‌లో కనిపించకుండా పోయాయని అనే వార్తలు బయటికి వచ్చాయి. దీంతో ఆ సీన్స్ రీ షూట్ చేస్తున్నట్లు సమాచారం. అయితే దీనిపై చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించనప్పటికి తాజాగా విడుదల తేదీ వాయిదా వేసుకుంది.